క్లుప్తంగా

ఐవోసీఎల్ డిపోలో మెగా రక్తదాన శిబిరం



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎం ఆసిఫ్ అహ్మద్

రామగుండం: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) కుందనపల్లి డిపోలో మంగళవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో తలసేమియా సికిల్‌సెల్ పిల్లల ఆరోగ్య అవసరాల నిమిత్తం మెగా రక్తదాన శిబిరం నిర్వహించినట్లు సీనియర్ డిపో మేనేజర్ ఎండీ.ఆసిఫ్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన వారిని అభినందిస్తూ యువకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఐశ్వర్య, సేఫ్టీ ఆఫీసర్ గుంటి కృష్ణస్వామి, మంచిర్యాల జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, తలసేమియా వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కాసర్ల రంజిత్‌కుమార్, రక్తనిధి సిబ్బంది మాధవి, రవి వర్మ తదితరులు పాల్గొన్నారు.

గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



కప్ అందిస్తున్న అన్నయ్యగౌడ్

సుల్తానాబాద్: క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని సర్పంచుల ఫోరం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ అన్నారు. మంగళవారం సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని మినీ స్టేడియంలో జునగిరి రంజిత్ కుమార్ స్మారకార్థం జరిగిన మండల స్థాయి క్రికెట్ మ్యాచ్ ఫైనల్‌లో గర్రెపల్లి విజయం సాధించింది. సుల్తానాబాద్ 9వ వార్డ్ క్రీడాకారులు రన్నరప్‌గా నిలిచారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మినుపాల ప్రకాశ్‌రావు, కౌన్సిలర్ చింతల సునీత, రాజు, దున్నపోతుల రాజయ్య, అబ్బయ్యగౌడ్, జూనగిరి ప్రసాద్, మెంగని శ్రీను, కోట శ్రీను, షాబుద్దీన్, ఇక్బాల్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన పతేహైమద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి కుమారుడు రజాక్‌కు మంగళవారం తోటి స్నేహితులు రూ.12వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో బసవత్తుల జ్ఞానేంద్రచారి, శ్రీనివాస్, కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, తరుణ్, రాజేందర్, దేవేందర్‌రెడ్డి, కుమారస్వామి, సురేశ్, మనోజ్‌రెడ్డి, మునేశ్ పాల్గొన్నారు.

నీటి తొట్టెల్లో నీరు నింపిన కార్పొరేషన్ సిబ్బంది



సాక్షి ఎఫెక్ట్..

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్ రైల్వేట్రాక్ సమీపంలో పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెలు ఏర్పాటు చేసిన అధికారులు వాటిలో నీరు పోయడం లేదు. దీంతో మంగళవారం సాక్షిలో 'అలంకారప్రాయంగా నీటి తొట్టెలు' కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ నీటి తొట్టెల్లో నీరు నింపేందుకు సంబంధిత విభాగం అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం నీటి తొట్టెలలో నీరు నింపారు. పశువుల దాహార్తి తీర్చేందుకు కృషిచేసిన 'సాక్షి'కి స్థానిక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి జాడేది?

- గుంతలమయంగా ప్రధాన రోడ్లు
- అభివృద్ధి నిధుల కేటాయింపు శూన్యం
- పట్టించుకోని అధికారులు



ఆర్ఎఫ్‌సీఎల్ ప్రభావిత గ్రామాల్లో రోడ్ల దుస్థితి

ఫెర్టిలైజర్‌సిటీ: పరిశ్రమలు వస్తే ప్రభావిత గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పంట పొలాలు, ఇళ్ల స్థలాలు ఇచ్చాం. పరిశ్రమలు వచ్చిన ప్రభావిత గ్రామంలో అభివృద్ధి చేందడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రామగుండం కార్పొరేషన్ పరిధిలోని లక్ష్మీపురం, వీర్లపల్లి ప్రభావిత గ్రామాల్లో మౌలిక వసతులు తాగునీరు, సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వీధిదీపాలు వంటి మౌలిక సదుపాయాలు ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం కల్పించాలి. ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంట్ ప్రారంభ సమయంలో 2015 మార్చి 11న ఆర్ఎఫ్‌సీఎల్ అధికారులు వీర్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో కర్మాగారంలో ఉత్పత్తి మొదలుకాగానే ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చిన అధికారులు నేడు ఉత్పత్తి ప్రారంభించి ముడేళ్లు గడిచినా ప్రభావిత గ్రామాలపై కన్నెత్తి కూడా చూడడం లేదని ప్రభావిత గ్రామాల అసహనం వ్యక్తం చేస్తున్నారు. రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్ లిమిటెడ్ ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రభావిత గ్రామంలో అభివృద్ధి కుంటుపడింది. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం, రామగుండం నగరపాలక సంస్థ అధికారులు స్పందించి గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

సీఎస్ఆర్‌కు కేటాయించని నిధులు..

రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.486 కోట్ల ఆదాయం వచ్చింది. రామగుండం ఫర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో ఉత్పత్తి, రవాణా, ఆదాయం బాటలో ఉన్న కర్మాగారం ప్రభావిత గ్రామాల్లో మౌలిక వసతులు రోడ్లు, తాగునీటి సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించలేదు. ప్రభావిత గ్రామాల్లో నెలరోజులకు ఒక్కసారి మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ప్రభావిత గ్రామాల ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన యాజమాన్యం గ్రామాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని తెలిపారు.

గ్రామాలకు నిధులు కేటాయించాలి..

ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలి. నిధులను కార్పొరేషన్‌కు కేటాయించడంతో ప్రభావిత గ్రామాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో నిధులు ఉపయోగిస్తూ ప్రభావిత గ్రామాలకు మొండి చేయి చూపుతున్నారు. ప్రభావిత గ్రామాల్లో అభివృద్ధి పనులను రోడ్లు, వీధిపాలు, డ్రైనేజీ నిర్మాణ పనులను యాజమాన్యం చొరవచూపి అభివృద్ధి పనులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం ప్రభావితం గ్రామాల్లో అభివృద్ధికి కేటాయించిన నిధులను నేరుగా యాజమాన్యమై అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. ప్రభావిత గ్రామాల అభివృద్ధి కోసం యాజమాన్యాలు, అధికారులు స్పందించి ప్రభావిత గ్రామాల అభివృద్ధికి నిధులు నేరుగా గ్రామాలకే కేటాయించాలని ప్రభావిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు పనులు చేపట్టాలి



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నిర్మాణ క్రమంలో లక్ష్మీపురం కొత్త గేట్ నుంచి వీర్లపల్లి గ్రామాల మీదుగా వెళ్లే ప్రధాన రహదారి ప్లాంట్ నిర్మాణ క్రమంలో భారీ యంత్రాలు, కర్మాగార సామగ్రిని ప్లాంటుకు చేర్చే క్రమంలో భారీ వాహనాలు నడపడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై ప్రమాదకరంగా మారింది. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి. రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే సుమారు 15 గ్రామాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుంది. – **వేణుగోపాల్‌రావు, వీర్లపల్లి**

కాలుష్యంతో అనారోగ్యం



ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారం నుంచి వెలువడే కాలుష్యంతో ప్రభావిత ప్రాంతాల ప్రజలు అనారోగ్యాన బారిన పడుతున్నారు. ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యం స్పందించి ప్రభావిత గ్రామాల్లో ప్రతినెలా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయాలి.

– **బూర్ల శ్రీనివాస్, లక్ష్మీపురం కొత్తగేట్**

నిధులు కేటాయించాలి



ఆర్ఎఫ్‌సీఎల్ యాజమాన్యాలు ప్రభావిత గ్రామాలకు నేరుగా నిధులు కేటాయిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయి. అలాకాకుండా కార్పొరేషన్ నిధులు కేటాయించడంతో ప్రభావిత గ్రామాల్లో తక్కువ మొత్తంలో నిధులు కేటాయించి ఇతర ప్రాంతాలలో ఎక్కువ నిధులు కేటాయించే అవకాశాలు ఉన్నాయి. యాజమాన్యాలు నేరుగా ప్రభావిత గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలి. – **బల్ల నాగరాజు, లక్ష్మీపురం కొత్తగేట్**

గ్రంథాలయంలో సౌకర్యాల లేమి

- కుర్చీలు, నీళ్లు లేక పాఠకుల ఇబ్బంది
- నిరుపయోగంగా మరుగుదొడ్లు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

యైటింక్లయిన్‌కాలనీ: ఉద్యోగ ప్రకటన వచ్చిందంటే నిరుద్యోగ యువత వారికి కావాల్సిన మెటీరియల్ కోసం గ్రంథాలయాలకు వెళ్తుంటారు. లక్షలు ఖర్చు పెట్టి సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లలకు, సింగరేణి ప్రభావిత గ్రామాల నిరుద్యోగ యువకుల కోసం ఆర్జీ–2 సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో యైటింక్లయిన్‌కాలనీలో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో ఎలాంటి సౌకర్యాలు లేక పాఠకులు ఇబ్బందులు పడుతున్నారు. పాఠకుల కోసం కనీస సౌకర్యాలు కల్పించడంలో సింగరేణి యజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పలువురు అంటున్నారు. పాఠకుల కోసం 2009లో శ్రీమతి ఇందిరా దత్తాత్రేయులు, జ్ఞాన సరస్వతి గ్రంథాలయం అని నామకరణ చేయగా నాటి ఆర్జీ–2 జీఎం రాజేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. నేటికీ 15ఏళ్లు గడిచిన గ్రంథాలయంలో కుర్చీలు, నీటి వసతి, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించలేదని పాఠకులు వాపోతున్నారు. గ్రంథాలయంలో ఉన్న ఐదు కుర్చీల్లో రెండు కుర్చీలు విరిగిపోయి ఉన్నాయి. నా సింగరేణి యజమాన్యం గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు..

గ్రంథాలయానికి వచ్చే పాఠకుల కోసం సింగరేణి యజమాన్యం నిర్మించిన టాయిలెట్స్, మరుగుదొడ్లకు నీటి వసతి లేక నిరుపమోగంగా మారాయి. పాఠకులు మూత్రవిసర్జన కోసం ఇంటికి వెళ్లి రావాల్సిన పరిస్థితి ఉందని వాపోతున్నారు.

నీటి వసతి లేక..



గ్రంథాలయంలో నీటి వసతి లేకపోవడంతో మధ్యలోనే ఇంటికి వెళ్లాల్సి వస్తోంది. నీటి వసతితో పాటు చదువుకునేందుకు గాను కావాల్సిన స్టడీ మెటీరియల్ సమకూర్చాలి.

– **బి.వీరన్న పాఠకుడు, యైటింక్లయిన్‌కాలనీ**

వినియోగంలోకి తీసుకురావాలి



గ్రంథాలయానికి వచ్చిన పాఠకులు సరైన కుర్చీలు, మరుగుదొడ్లు లేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి కోసం నిర్మించిన మరుగుదొడ్లను నీటి సౌకర్యం కల్పించి ఉపయోగంలోకి తీసుకురావాలి.

– **పి.భావన, పాఠకురాలు, యైటింక్లయిన్‌కాలనీ**

పట్టించుకోవాలి



రూ.లక్షలు ఖర్చు చేసి కార్మికుల పిల్లల కోసం నిర్మించిన గ్రంథాలయంలో సౌకర్యాలు కల్పించడంలో సింగరేణి యాజమాన్యం విఫలమైంది. సింగరేణి యజమాన్యం గ్రంథాలయంలో వసతులు కల్పించాలి. – **ఉల్లి మొగిలి, ఆర్జీ–2 ఏరియా సీఐటీయూ జిల్లా నాయకులు**

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు



బారికేడ్స్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

సుల్తానాబాద్‌రూరల్: రాజీవ్ రహదారిపై రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు. సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి నుంచి చిన్నకల్వల రాజీవ్ రహదారిపై ప్రమాదాలు జరిగే స్థలాల్లో మంగళవారం బారికేడ్స్‌ను పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ నిత్యం ప్రమాదాలు జరిగే స్థలాలైన దుబ్బపల్లి, గర్రెపల్లి, కాట్నపల్లి, స్వప్నకాలనీ, తెలంగాణ చౌరస్తా, పూసాల రోడ్డుల్లో నియంత్రణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అలాగే స్పీడ్ నియంత్రణ కోసం మలుపుల వద్ద సూచికలు, రేడియం స్టిక్కర్లతో బోర్డులు, బ్లింకింగ్ లైట్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోడ్డు పక్కన భారీ వాహనాలను నిలపకుండా పెట్రోలింగ్ బృందం చూసుకుంటుందన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందించే విధంగా రోడ్డు సేఫ్టీ వాట్సప్ గ్రూపును క్రియేట్ చేశామని, అందులో పోస్టు చేసిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుంటారని పేర్కొన్నారు.

మొబైల్ ఫోన్లలో ఫలితాలు



ఫోన్‌లో ఫలితాలు వీక్షిస్తున్న ఆటోడ్రైవర్లు

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం పారిశ్రామిక ప్రాంతానికి చెందిన ఆటోడ్రైవర్లు, వాహనదారులు పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలను తమ మొబైల్ ఫోన్లలో వీక్షిస్తూ కనిపించారు. ప్రసార మాధ్యమాలు, మొబైల్ ఫోన్లలో ఫలితాలను ఎప్పటికప్పుడు వీక్షించారు. గౌతమినగర్ ఆటోస్టాండ్ వద్ద ఆటోడ్రైవర్లు మొబైల్ ఫోన్‌లో ఎన్నికల ఫలితాలు తెలుసుకునేందుకు ఆసక్తి ప్రదర్శించారు.

పరామర్శ



గోదావరిఖని: మాజీ కార్పొరేటర్ దొంతుల లింగయ్య కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మంగళవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే వెంట కార్పొరేటర్లు, నాయకులున్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ దీనా

ధర్మారం: స్థానిక మోడల్ స్కూల్‌విద్యార్థులు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ దీనా మంగళవారం తెలిపారు. సుల్తానాబాద్ జూనియర్ కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి అండర్– 14లో మనోజ్ఞ 100 మీటర్లలో ప్రథమ, సాజ్ఞశ్రీ 400 మీటర్లలో ప్రథమ, అఖిలేష్ 100 మీటర్లలో పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె వివరించారు. సామిల్ 400 మీటర్లలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. ఈనెల 6 నుంచి 7వ తేదీ వరకు హన్మకొండ జిల్లాలోని జేఎన్ఎస్ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు జిల్లా తరఫున పాల్గొంటారని పేర్కొన్నారు.

జిల్లాలో వర్ష బీభత్సం



జ్యోతినగర్: రోడ్డుపై విరిగిపడిన చెట్లు



జూలపల్లిలో కురుస్తున్న వర్షం

- విరిగిన చెట్లు.. ధ్వంసమైన రేకులు
- విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం



రామగుండం: భీమయ్యకాలనీలో వంగిన విద్యుత్ స్తంభం

జ్యోతినగర్(రామగుండం): జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం గాలివాన బీభత్సం సృష్టించింది. గాలివానకు జిల్లావాసులు అవస్థలు పడ్డారు. ఒక్కసారిగా వీచిన ఈదురుగాలుల ధాటికి జనజీవనం స్తంభించింది. ప్రధానంగా ఎన్టీపీసీ ఎఫ్‌సీఐ క్రాస్‌రోడ్డు వద్ద భారీచెట్లు విరిగిపడ్డాయి. నర్రశాలపల్లెలో విద్యుత్ స్తంభాలు కుప్పకూలాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో అంధకారం చోటుచేసుకుంది, రోడ్లపై విరిగిడిన చెట్లను శాన్వి రెస్టారెంట్ యజమానులు డోజర్ సాయంతో తొలగించారు. నర్రశాలపల్లెలో మామిడిపల్లి శంకరయ్యకు చెందిన ఇంటిరేకులు ఈదురుగాలులు ఎగిరిపోయాయి. సింధూర కళాశాల రోడ్డుపై వర్షపునీరు నిలిచి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది.

జూలపల్లిలో..

జూలపల్లి: వివిధ గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో ప్రజలు ఒకింత భయానికి గురయ్యారు.

ఎలిగేడులో మోస్తరు వర్షం

ఎలిగేడు: ధూళికట్ట, ఎలిగేడు, నర్సాపూర్, ముప్పిరితోట తదితర గ్రామాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. ఎండ, వేడితీవ్రతను తట్టుకోలేక అల్లాడుతున్న ప్రజలు.. మోస్తరు వర్షంతో చల్లబడిన వాతావరణంతో ఉపశమనం పొందారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: రోహిణి కార్తెలో రెండోసారి మంగళవారం వివిధ గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో సాగుకు సన్నద్ధమవుతున్న అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పెగడపల్లిలోని గరిగంటి సదయ్యకు చెందిన పాడిఆవు పిడుగుపడి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దీని విలువ సుమారు రూ.40వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. మేకల రాజయ్య రేకులషెడ్డు గాలి ధాటికి ధ్వంసమైంది.

రామగుండంలో..

రామగుండం: స్థానిక ఆదర్శనగర్ కాలనీలోని మాల మహానాడు కమ్యూనిటీ హాల్ రేకులు, హ్యాంగర్స్ ధ్వంసమయ్యాయి. సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని మాలమహానాడు ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా భీమయ్య కాలనీలో విద్యుత్ స్తంభం వంగిపోయింది. తీగలు తెగి సరఫరా నిలిచిపోయింది.

ఓదెలలో..

ఓదెల: కొలనూర్, గోపరపల్లె, ఓదెల, లంబాడితండా, మడక, గుంపుల గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. సృష్టించింది. మడక, లంబాడితండాలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. గోపరపల్లె, ఓదెల, కొలనూర్‌లో రోడ్లకు ఇరువైపులా చెట్లు నేలకూలాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

పాక్షికంగా ధ్వంసమైన ఇల్లు

సుల్తానాబాద్‌రూరల్: రేగడిమద్దికుంట గ్రామంలోని బల్ల ఎల్లయ్యకు చెందిన ఇంటి పైకప్పు పాక్షికంగా ధ్వంసమైంది. ఇంట్లోని వస్తుసామగ్రి వర్షపునీటిలో తడిసిపోయింది.

మంథనిలో గేదె మృతి

మంథని: ధర్మారంలో పిడుగుపాటుకు ముర్రాజాతి గేదె మృత్యువాతపడింది. గ్రామానికి చెందిన కటకం సాయిలు గేదెను కొట్టంలో కట్టేయగా పిడుగుపాటుకు గురై అక్కడిక్కడే ప్రాణాలు వదిలిందని, సుమారు రూ.1.50లక్షల వరకు నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు.



కాల్వశ్రీరాంపూర్‌లో కురుస్తున్న వర్షం



రేగడిమద్దికుంటలో లేచిపోయిన ఇంటి పైకప్పు

పెద్దపల్లిలో కాంగ్రెస్ సంబరాలు



ఎంపీ వంశీకృష్ణతో ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



సంబరాల్లో కాంగ్రెస్ నాయకులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి లోక్‌సభ సభ్యుడిగా గడ్డం వంశీకృష్ణ ఎన్నిక కావడంతో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పెద్దపల్లి బస్టాండ్ వద్ద మంగళవారం పార్టీ నాయకులు టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచారు. పార్టీ నాయకులు శ్రీనివాస్, కీర్తి రాజయ్య, సర్వర్, ఆరగొండ రాజ్‌కుమార్, కొమ్ము శ్రీనివాస్, గుర్రాల రాజు, బొడ్డుపల్లి అశోక్, డీఎస్ మూర్తి, ఈర్ల ప్రవీణ్, నలువాల రంజిత్, దర్గుల సతీశ్, ఓదెలు, ప్రవీణ్, సదయ్య, మల్లేశ్ సాగర్ ఉన్నారు.

ఎంపీకి ఠాకూర్ అభినందన

గోదావరిఖని: పెద్దపల్లి ఎంపీగా గెలుపొందిన కాంగ్రెస్ నేత గడ్డం వంశీకృష్ణను రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ మంగళవారం అభినందించారు. భారీ మెజార్టీతో గెలుపొందిన వంశీకృష్ణను శాలువాతో సన్మానించారు.

ధర్మారం: ధర్మారం మండల కేంద్రంలో పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: ఎంపీగా గెలుపొందిన గడ్డం వంశీకృష్ణను యైటింక్లయిన్‌కాలనీ కాంగ్రెస్ నాయకులు కాలనీ పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, జక్కుల దామోదర్‌రావు మంగళవారం సన్మానించారు. అలాగే పెద్దపల్లి జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్, రామగిరి మండలం ముస్త్యాల మాజీ సర్పంచ్ లావణ్య శుభాకాంక్షలు తెలిపారు.

ముత్తారం: కాంగ్రెస్ నుంచి పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణ గెలుపు హర్షణీయమని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ పేర్కొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్‌లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య నేతృత్వంలో అంబేడ్కర్ చౌరస్తాలో టపాసులు పేల్చారు.

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్ కాలనీ తెలంగాణ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకున్నారు. రామగిరి మండలం వెంకట్రావుపల్లి కేకే నగర్లో కాంగ్రెస్ నాయకులు బాణసంచాకాల్చి సంబరాలు జరుపుకున్నారు.

మంథని: మంథని డివిజన్‌లో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు శివ పాల్గొన్నారు.

ఓదెల: ఓదెల మాజీ ఎంపీటీసీ బోడకుంట చిన్నస్వామి, కాంగ్రెస్ నాయకులు అల్లం సతీశ్ ఆధ్వర్యంలో ఓదెల చౌరస్తాలో సంబరాలు జరిపారు.

ఎలిగేడు: ఎలిగేడులో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు.

కమాన్‌పూర్: మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు.